స్టోర్‌రూంలా.. వార్డు కార్యాలయాలు..!



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లోని వెంకటేశ్వరకాలనీ డివిజన్ వార్డు కార్యాలయం దుస్థితి..

- అధికారులు లేక వెలవెల
- ప్రజలకు దూరమవుతున్న సేవలు
- పట్టించుకోని అధికారగణం
- జీహెచ్ఎంసీ నిఘా కరువు
- పూర్వవైభవం తీసుకురావాలని పలువురు విజ్ఞప్తి





వెంకటేశ్వరకాలనీ: ప్రజలకు పాలనను మరింత దగ్గర చేసే కార్యక్రమంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వార్డు కార్యాలయాల పాలనను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి వార్డులోనూ ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అందులోనే పారిశుద్ధ్య, దోమల నివారణ, ఇంజినీరింగ్, ఎలక్ట్రిసిటీ విభాగాలను తదితర అధికారురులను అందుబాటులో ఉంచింది. ఎన్నో ప్రయోజనాలతో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలు ప్రస్తుతం స్టోర్‌రూంలా మారాయి. పట్టించుకునే దిక్కు లేక అధికార యంత్రాంగం అటువైపు చూడకపోవడంతో సామగ్రి మొత్తం మూలనపడి పరిస్థితి దయనీయంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వార్డు కార్యాలయాల్లో కుర్చీలు, టేబుళ్లు మూలనపడ్డాయి. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లోని వెంకటేశ్వరకాలనీ డివిజన్ వార్డు కార్యాలయంలో సామగ్రి మొత్తం మూలనపడగా, అధికారులు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయం సైతం అధికారులు లేక వెలవెలబోతున్నది. సంబంధిత అధికారులు వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతన్నాయి. వివిధ రకాల పౌర సేవలు అందుబాటులో ఉండి సంబంధిత అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గతంలో ఈ వార్డు కార్యాలయాలను తెరిచారు. ఆయా వార్డులకు సంబంధించిన ఇంజినీర్లు, పారిశుద్ధ్యం, దోమల నివారణ, ట్యాక్స్ విభాగం, కరెంటు విభాగం, మంచినీటి విభాగం తదితర అధికారులను అందుబాటులో ఉండేవిధంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒక రిసెప్షనిస్టును కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ వివిధ సేవలపై వచ్చే పౌరుల వివరాలు రాసుకోవడమే కాకుండా వారిచ్చిన ఫిర్యాదు ఏ దశలో ఉందో కూడా ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని నిర్దేశించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, సోమాజీగూడ డివిజన్లలో ఎక్కడికక్కడ ఈ వార్డు కార్యాలయాలు ఎంతో ఆర్భాటంగా తెరిచారు. అయితే నియంత్రణ అధికారి ఇక్కడకు రాకపోవడంతో మిగతా అధికారుల అడ్రస్ గల్లంతైంది. వారు ఎప్పుడు వస్తారో, ఎక్కడ కూర్చుంటున్నారో తెలియడం లేదు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో పౌరులు వార్డు కార్యాలయాలకు రావడం మానేశారు. దీంతో ఇప్పుడు పేరుకు మాత్రమే వార్డు కార్యాలయాలు అన్న రీతిలో తయారయ్యాయి. ఇప్పటికైనా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ స్పందించి వార్డు కార్యాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చి పౌరులకు నాణ్యమైన సేవలు అందిలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

లిబర్టీ: పేద విద్యార్థులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రు కుమారస్వామి కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ గత కొన్ని సంవత్సరాలుగా చెల్లించకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వృత్తి విద్యా కోర్సుల్లో విద్యాభ్యాసం చేస్తున్న లక్షలాదిమంది విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 7వేల కోట్లను చెల్లించకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లకుండా ఆటంకాలు కలుగుతున్నాయన్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంబీఏ, ఎంఎస్సీ ఇతర కోర్సుల అభ్యాసం పూర్తి చేసుకున్న వారు ఉన్నత చదువులకు వెళ్లాలంటే ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్: ఇంటిముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే మహ్మద్ ఇంతియాజ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 18వ తేదీ రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలి

లిబర్టీ: ప్రైవేటు రంగంలో ఎస్సీలకు రిజర్వేన్లు కల్పించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు లేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పార్లమెంటులో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాల అసెంబ్లీలో చట్టం తీసుకురావాలన్నారు. అన్నింటా వెనుకబడి దళిత బహుజనులు దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. దళితులు ఉన్నత చదువులు చదివిన ఉద్యోగం ఉపాధి దొరకని పరిస్థితి నెలకొందని, కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా దళితులకు ఆర్థిక పురోగతి కల్పించినట్లు అవుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు వద్ద జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సంబరాలు కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్, ఐటీసీ కోహినూర్ వారి సహకారంతో తడి, పొడి చెత్తను వేరు చేయడం, హానికరమైన చెత్త వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో పాఠశాలల విద్యార్థులను భాగస్వాములను చేశారు. తడి,పొడి చెత్తలను వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఈ సందర్భంగా సూచించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు, రెడ్యూస్, రీయూజ్ అండ్ రీసైక్లింగ్‌పై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డిప్యూటీ కమిషనర్ రజినీకాంత్, ఏఎంహెచ్‌ఓ, స్వచ్ఛభారత్ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ యశశ్రీ, నరేష్, జయశ్రీ, ఐటిసి సిబ్బంది పాల్గొన్నారు.

నివాస స్థలాలు కేటాయించే వరకు

పోరాటం చేస్తాం

తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక సంఘం రాష్ట అధ్యక్షుడు వేముల యాదయ్య



మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి, యాదయ్యలు



ప్రత్యేక ఆకర్షణగా బ్యానర్

రహమత్‌నగర్: క్వారీ స్థలంలో పేద వడ్డెరలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు తాము న్యాయపమైన పోరాటం చేస్తామని తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక సంఘం స్పష్టం చేసింది. ఈ పోరాటంలో ప్రతి ఒక వడ్డెర కులస్తుడు పాల్గొనాలని అ సంఘం పిలుపునిచ్చింది. ఎస్పీఆర్ హిల్స్ క్వారీ స్థలంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అ సంఘం రాష్ట అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ క్వారీ స్థలం వడ్డెరలకు చెందుతుందని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 9 ఎకరాలు 16 గుంటల స్థలం వడ్డెరలకు కేటాయించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఆ తరువాత పీజేఆర్ కూడా తమకు క్వారీ స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరిగిందన్నారు. ప్రస్తుత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే క్వారీలో వడ్డెరలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని వాగ్దానం చేసి మాటతప్పారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న క్వారీ స్థలంలో పేద వడ్డెరలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు న్యాయపరమైన తామంత పోరాటం చేస్తామని ఆయన ప్రకటించారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మాట్లాడుతూ వడ్డెర కులస్తుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వడ్డెర ఐక్య వేదిక సంఘం ఎన్టీరామారావు, పీజేఆర్, మాగంటి గోపీనాథ్‌ల ఫొటోలతో ఏర్పాటు చేసిన బ్యానర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, నగర అధ్యక్షుడు ముద్దంగులు శేఖర్, వడ్డెర సంఘం నాయకులు పాండు. సురేష్, వెంకటేష్, రాజు, మల్లేశ్, మురళీలతో పాటు దళిత సేనా నాయకులు బాలయ్య, యాదగిరి తదితరులు మద్దతుగా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రహమత్‌నగర్: వడ్డెర ఆత్మగౌరవ భవన్ సముదాయం ఆధ్వర్యంలో ఎత్తరి జంగయ్య, రాములమ్మల జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో స్థానిక కార్పొరేటర్ సీఎస్ రెడ్డి పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయం చైర్మన్ సత్యనారాయణ, ఎత్తరి అంతయ్య, డా.ఓర్సు కృష్ణ, మోహన్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అనన్య ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండీపై చీటింగ్ కేసు

బంజారాహిల్స్: ఒప్పందం ప్రకారం తమకు స్థలాలు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో పాటు కోట్లాది రూపాయలు తీసుకున్న తర్వాత కూడా ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు అనన్య ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాజ్‌కుమార్ రాయ్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లో ఉన్న హెచ్ఎస్ఆర్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ దూరెడ్డి ధీరజ్ 2018లో అబ్దుల్లాపూర్‌మెట్‌లో 34 ఎకరాల 25 గుంటల స్థలాన్ని అనన్య ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి కొనుగోలు చేశాడు. ఇందుకు గాను రూ.8.37 కోట్లు అనన్య ప్రాజెక్ట్స్ ఎండీ రాజ్‌కుమార్‌రాయ్‌కు చెల్లించాడు. అయితే ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయకపోగా తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని, అసాంఘిక పద్ధతుల్లో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధీరజ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. రాజ్‌కుమార్‌రాయ్ అక్రమాలకు, చట్ట విరుద్ధమైన కార్యక్రమాలతో పాల్పడడమే కాకుండా ఈ విషయాన్ని దాటవేస్తూ వస్తున్నాడని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులు రాజ్‌కుమార్‌రాయ్‌పై ఐపీసీ 406, 420, 506 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీకెండ్స్‌లో బైక్ రేసింగ్ హంగామా!

గచ్చిబౌలి: వీకెండ్స్ వస్తే చాలు నగరం నుంచి హైదరాబాద్ నాలెడ్జి సిటీ పరిసరాల్లోకి వచ్చి బైక్‌లతో విన్యాసాలు చేస్తూ, రేసింగ్‌కు పాల్పడడం పరిపాటిగా మారిపోయింది. శనివారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు బైక్‌లతో యువకులు రేసింగ్‌లకు పాల్పడడం, ఇతర ప్రయాణికులకు ఇక్కట్లు సృష్టించడం జరుగుతూనే ఉంది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయి. వీటిని పూర్తిగా అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాయదుర్గం పోలీసులు పది బైక్‌లను సీజ్ చేసి, పది మంది యువకులపై కేసు నమోదు చేశారు.



అలనాటి స్నేహితుల కలయిక!

సాక్షి, సిటీబ్యూరో: 50వ దశకంలో పాఠాలు నేర్చుకున్న వారంతా ఒక్కచోట చేరారు. ఇన్నేళ్ల తర్వాత అలనాటి స్నేహితులతో కలిసి ముచ్చటించారు. కృష్ణా జిల్లా తాడంకి జడ్పీ హైస్కూల్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆ స్కూల్ పూర్వ విద్యార్థులంతా ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్ తబలా హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి 1953-54 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన ప్రభాకరరావు, ప్రకాశరావు, రిటైర్డ్ డీఎస్పీ శాంత రామారావు, అనంత లక్ష్మి, వెంకటేశ్వరావు, పి.తిరుమల ప్రసాద్, వై.మస్తాన్‌రావు తదితరులు హాజరయ్యారు.







వాకర్లను వేధిస్తున్న పార్కింగ్ సమస్య

అధికారులతో చర్చించి పరిష్కరిస్తాం : విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు వాకర్లను నిత్యం పార్కింగ్ సమస్య వేధిస్తున్నదని త్వరలోనే ఈ సమస్యపై అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని కేబీఆర్ నేచర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరిగపుడి విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జింఖానా క్లబ్‌లో నేచర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాకర్లు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. పార్కులో కొన్ని కమర్షియల్ యాక్టివిటీస్ జరుగుతున్నాయని వాటిని అరికట్టాలని సూచించారు. అదే విధంగా వాకర్లకు వాకింగ్ ట్రాక్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే వారిని ప్రధాన గేటు వద్దకు తీసుకొచ్చే విధంగా ఓ బ్యాటరీ వాహనాన్ని అందుబాటులో ఉంచాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వాకర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అదే విధంగా పార్కులో సీనియర్ సిటిజన్లు కూర్చునేందుకు అవసరమైన చోట్ల బెంచీలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సెక్రటరీ లక్ష్మారెడ్డి, కోశాధికారి సురేష్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీ వైఈపీ రెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ ప్రారంభోత్సవం

కాచిగూడ: హిమాయత్‌నగర్ డివిజన్, రాజమొహల్లా బస్తీలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి, బీఆర్ఎస్ నేతలు గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు



వెంగళరావునగర్: పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, అదే సీపీఎం ప్రధాన ఎజెండా అని ఆ పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు తెలియజేశారు. హైదరాబాద్ నగర 23వ మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం ఆదివారం స్థానిక వెంగళరావునగర్‌కాలనీలోని బ్రహ్మం టాలెంట్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 23వ మహాసభలు ఈనెల 30 నుంచి మూడు రోజులపాటు వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో జరగనున్నట్టు తెలియజేశారు. ప్రజా సమస్యలపై పోరాడి పరిష్కరించేది సీపీఎం ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. ఈ మహాసభలకు నగర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు కదిలి రావాలని సూచించారు. అనంతరం హైదరాబాద్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆహ్వాన సంఘం చైర్మన్‌గా సీహెచ్.చంద్రశేఖర్‌రావు, పాట్రన్స్‌గా పోసాని సుబ్బారావు, రాజేష్, ఉపాధ్యక్షులుగా శ్యామల రాజన్‌బాబు, టి.సాయిశేషగిరిరావు, జె.స్వామి, లింగయ్య, ప్రసాద్, కార్యదర్శిగా రాపర్తి అశోక్, పాపారావు, యాదగిరిలను ఎన్నుకున్నారు.





డిమాండ్లు నెరవేర్చేలా ఉద్యమాలు చేయాలి

ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్

పంజగుట్ట: ప్రభుత్వంలో ఉన్న వారికి ముదిరాజ్‌ల సమస్యలు తీర్చడం ఒక తప్పనిసరి అవసరంగా మారేలా మన ఉద్యమాలు ఉండాలని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముదిరాజ్ ఇంటలెక్చువల్ కన్వెన్షన్, ముదిరాజ్ కుల మహనీయులు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్, జనసమితి నాయకుడు నిజ్జన రమేష్, సంపాదకుడు ఉప్పరి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివ ముదిరాజ్ రచించిన 'ముదిరాజ్ కుల మహనీయులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏలోకి మారుస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇప్పటి వరకు హామీని నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నోటిఫికేషన్లు పడ్డ ఉద్యోగాల్లో, విద్యలో ముదిరాజ్‌లు ఎంతో నష్టపోయారన్నారు. వెంటనే ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ నాయకులు శ్రీకాంత్, వెంకటేష్, మహిళా నాయకులు ఆశాప్రియ, రమాదేవి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మిద్దె తోటలతో ఎంతో ఉపయోగం



మిద్దెతోటల స్టాల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: నగర ప్రజలు తమకున్న కొద్దిపాటి స్థలంలోనే మిద్దెతోటలు ఏర్పాటు చేసుకొని రకరకాల కూరగాయలు, ఆకు కూరలు సాగు చేసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. ఆదివారం కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో మిద్దెతోటల ఏర్పాటు, వినియోగంపై ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆమె అభినందించారు. ప్రతి ఒక్కరూ మిద్దె తోటల సాగుపై దృష్టిసారించాలని సూచించారు.



సమాజ్‌వాది పార్టీని బలోపేతం చేయాలి



బంజారాహిల్స్: గ్రేటర్ హైదరాబాద్‌లో సమాజ్‌వాది పార్టీ బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాడాలని ఏపీ సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు పాశం వెంకటేష్ సూచించారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ సమాజ్‌వాది పార్టీ నేత, సామాజిక కార్యకర్త దండుబోయిన కళ్యాణ్ యాదవ్, తెలంగాణ మాదిగ దండోరా అధ్యక్షుడు మదిరె నర్సింగ్‌రావుతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల పార్టీలో చేరిన నేతలు వారివారి ప్రాంతాల్లో శ్రేణులను ఐక్యం చేస్తూ ప్రజా సమస్యలపై పోరాడాలని తీర్మానించారు. త్వరలోనే సమాజ్‌వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సూచనలతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థాయిల్లో కమిటీలు వేస్తామని పెద్దఎత్తున పార్టీ సభ్యత్వ నమోదును నిర్వహిస్తామని తెలిపారు. మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో యూపీలో ఏ విధంగా అయితే సమాజ్‌వాది విజయం సాధించిందో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అదే తరహా ఫలితాలు రాబట్టి యూపీలో అఖిలేష్ యాదవ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని అన్నారు.



రాంసుందర్‌రెడ్డికి నివాళి



రాంసుందర్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్: బీజేపీ రాష్ట్ర నాయకురాలు పాదూరి కరుణ భర్త పాదూరి రాంసుందర్‌రెడ్డి సంతాప సభ ఆదివారం జూబ్లీహిల్స్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ దత్తాత్రేయతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొని రాంసుందర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రముఖ వ్యాపారవేత్తగా, సామాజికవేత్తగా రాంసుందర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

